# తెరపడింది!

డైనింగ్ టేబులు ముందు భర్తకెదురుగా కూర్చుని భోజనం చేస్తున్న అమలకు పొలమారటంతో ఎడమ చేతితో మాడు చరుచుకుని పక్కనే వున్న గ్లాసులో మంచినీళ్లు ఎత్తి గొంతులో పోసుకుంది.

"ఏం డియర్?.... ఈ మధ్య నిన్ను తలచుకునే వారు ఎక్కువౌతున్నారల్లే వుంది..' శ్రీమతి ముఖంలోకి చూస్తూ జోక్ చేశాడు. భాస్కర్.

మొగుడన్న మాట అట్లకాడ కాల్చి వాత పెట్టినట్టన్పించిన అమల ముఖం జేవురించింది.

'ఉన్నాడుగా మామ మహాశయుడు. ఆయనగారు నన్ను తిట్టిపోస్తూండి వుంటారు..' అమల మాటలో దెప్పిపొడుపు చోటుచేసుకుంది.

'ఆయనెవరు?' అర్థం కానట్టే అమలకేసి చూసాడు.

'ఎవరో తెలీనట్టు వెర్రి మొహం పెట్టక్కర్లేదు. మామ మహాశయుడంటే..మీ డాడీ బోధపడిందా?" గుర్రుగా మొగుడ్ని చూసింది.

'మా డాడీనా?' దేబెముఖం పెట్టాడు.

'అవును!' మీ బోడి డాడీనే..' అమల అలా అనటంలో వెటకారం చోటుచేసుకుంది.

'బో..డి డా..డీ నా మా నాన్న! ఆయనది బాల్డ్ హెడ్డేంకాదు. డెబ్బైయ్యో వడిలో పడినా..డైనమిక్ యంగ్ హీరోలా వుంటాడు. మా డాడీ!...నాకేమో నలభై దాటకుండానే జుట్టూడింది. క్రాఫ్ విషయంలో ఆయన పోలిక నాకు రానందుకు బాధగా ఉంది' జోవియల్‌గా అన్నాడు భాస్కర్.

'బాధ పడకండి' ఆయన బుద్ధులు మాత్రం పోకుండా వచ్చినయ్. కట్టుకున్నదాన్ని కాల్చుకు తినే విషయంలో'

'మమ్మీనెప్పుడూ మా డాడీ 'ఫ్రై' చేసుకుతిన్లేదు తెలుసా!?-నన్ను అనవసరంగా దెప్పద్దు. వళ్లు మండుద్ది!' చిటపటలాడేడు.

'మీకు మండనిది ఎప్పుడు? పెళ్లాం నోరు విప్పితే చాలు నీ శరీరంలో మంటలు..పొగలు రేగుతాయ్..'

"ఇదిగో నీ నోటికి దడిచే.. మమ్మీ డాడీ నాలుగు నెలలు మన తోటే వుండాలని వచ్చి వాళ్లల్లా... నెల తిరక్కముందే మూట ముల్లె సర్దుకుని వెళ్లిపోతున్నా... నేనున్నానే ఆడంగి వెధవని... అదే నీ పాద దాసుడ్ని... నోరు మెదపలేకపోయాను. ఇంట్లో నీదేనాయె పైచేయి..

పెత్తనమూను' నిస్సహాయత ద్యోతకమైంది భాస్కర్ మాటల్లో.

'తిన్నగా భోంచేయండి! మన మధ్య గొడవెందుకు?... మీతో మీ వాళ్లతో నా బాధ ఒక రోజుతో పోయేవి కాదు. అన్నీ నేను భరించక తప్పదు...'

'భరించక తప్పదా...!? ఎంత గొప్ప డైలాగు చెప్పావే.. ఈ మధ్య టీవీ సీరియల్స్ చూస్తూ నాలెడ్జి బాగా పెంచుకున్నావ్. ఇది రివర్స్ యుగం కదా? ఒకప్పుడు కోడళ్లను అత్తలు వేధించేవారు. ఇప్పుడేమో.. కోడళ్లే గయ్యాళితనం పెంచుకుని... మాటకి మాట సమాధానం చెప్తూ సూర్యకాంతాలవుతున్నారు. కానీ!... ఏం చేస్తాం? రోజులు మీవి!?' బుల్లి ఉపన్యాసం దంచాడు భాస్కర్.

'మీ దెప్పుళ్లు..ఎత్తిపొడుపులూ ఇక ఆపండి! చిరు కోపం ప్రదర్శించి భోజనం ముగించి లేచి వెళ్లి వాష్ బేసిన్లో చెయ్యి కడుక్కుంది అమల.

'మగాళ్లు ఎంత చదివి... ఎంత సంపాదిస్తే మాత్రం ఏంటి? అంతా తెచ్చి కట్టుకున్నదాని దోసిట్లో పోయాల్సిందేగా!... లేకుంటే పుడ్డు బెడ్డు రెంటికీ మొహం వాచి పోవాల్సి వస్తుందనే భయం!'

తల్లిదండ్రుల యందు దయలేని పుత్రుడు పుట్టనేమి వాడు గిట్టనేమి? (నాలాంటి వాడు...) తను తిన్న కంచంలోనే చేయి కడుక్కుని బెడ్‌రూమ్‌లోకెళ్లాడు భాస్కర్.

కళ్లు మూసుకున్నాడన్నమాటే గానీ ఎంతకీ నిద్ర వచ్చి చావటం లేదు.

టీ.వీ. ఆన్ చేశాడు.

'మహిళలు మహరాణులు'- తెలుగు సీరియల్ వస్తూండటంతో... మరో స్టేషన్ ఆన్ చేశాడు. అక్కడ కూడా 'హోం మినిస్టర్' సీరియల్ వస్తోంది. వళ్లు మండింది భాస్కర్‌కు! ఏ స్టేషన్ ఆన్ చేసినా ఆడాళ్ల గొడవే! మగాళ్లను మనశ్శాంతితో వుండనీయరల్లే ఉంది...' అని రుసరుసలాడుతూ టీవీ కట్టేసి కళ్లు మూసుకున్నాడు.

ఇంతలో సెల్ రింగైంది! రాత్రి పదిదాటేక ఎవరబ్బా? అనుకుంటూ లేచి టీవీ పక్కనేనున్న మొబైల్ అందుకుని ఆన్ చేశాడు.

"నేను... రమేష్ మాట్లాడుతున్నాను..."అవలి వేపున కంఠం పలుకరించింది.

'అన్నయ్యా నువ్వా!? ఏమిటి ఈ వేళప్పుడు ఫోన్ చేశావ్? ఏమిటి? ముంబై నుండా మాట్లాడుతోంది? కేంపులో వున్నావా? ఆ చెప్పు!... అవును మమ్మీ డాడీ వెళ్లిపోయారు. అవును... నాలుగు నెలల పిరియడ్ పూర్తి కాకముందే వెళ్లిపోయారు. అవునూ? నీకెలా తెలుసు? నా వైఫ్ చెప్పిందా? నా వైఫ్ నీ శ్రీమతికి...తమ్ముడి భార్యకీ సెల్లో కమ్యూనికేష నిచ్చేసిందా? తోడికోడళ్ల ముగ్గురి మధ్య నెట్ వర్క్ బాగుందన్నమాట... ఎటొచ్చి..విషయాలు మనకే లేటుగా తెలుస్తుంటాయ్.. అవునా! వాళ్లు బయల్దేరి నీ దగ్గరకే కదా టరన్ ప్రకారం

రావలసింది!... తమ్ముడు భద్రం నుంచి నా వద్దకొచ్చారు.

నా వద్ద నుంచి నీ దగ్గరకే కదా మన పేరెంట్స్ రావాల్సింది. అలాంటప్పుడు... నీ వద్దకీ రాక.. తమ్ముడు భద్రం ఇంటికీ చేరుకోక ఎటుమాయమైనట్టు... నాకేం బోధపడటం లేదు... ఖర్మ కాలి కోడళ్లమీద అలిగి ముసలివారిద్దరు ఏ అఘాయిత్యానికైనా వొడిగట్టలేదు కదా? ఏవిటీ.. మిస్సింగ్ అంటూ టివిలో ప్రకటన ఇద్దామా...? వద్దు అన్నయ్యా... అలా చేస్తే బంధువర్గంలో కలకలం సృష్టించినవారి మౌతాం! అందరూ మన చేతగానితనాన్ని వేలెత్తిచూపుతూ తిట్టిపోస్తారు. కొడుకులమై వుండి విశ్వాస ఘాతకుల్లా ప్రవర్తిస్తున్నామనే నిందకు గురి కావలసివస్తుంది! ప్రస్తుతానికి సైలెంట్‌గా వుందాం! కాలమే సమస్యని పరిష్కరిస్తుంది. ఇవ్వాళ కాకపోతే రేపైనా అమ్మా నాన్నల అచూకి తెలీకపోదు. అందుచేత 'బీకామ్!... సంభాషణ ముగించి సెల్ ఆఫ్ చేసి మళ్లీ కళ్లు మూసుకున్నాడు భాస్కర్.

పైకి బింకంగా అన్నయ్యతో ఆ విధంగా మాట్లాడినా.. భాస్కర్ మనసు నిండా దిగులే! అమ్మా నాన్న... అటు అన్నయ్య దగ్గరకు.. ఇటు తమ్ముడు భద్రం వద్దకూ వెళ్లకుండా ఏమైనట్టు?-ఏమైనా వృద్ధాప్యంలో వారిపట్ల కోడళ్ళు పరిధులు మరచి నోటికొచ్చినట్లు మాట్లాడి...వారి ఫీలింగ్స్‌ను హర్ట్ చేస్తూ... వాళ్ల కింత తిండి కడుపునిండా పెట్టకపోవటం హర్షణీయం కాదు! కానీ ఎం చేయటం... ముగ్గురం అయోగ్యులమే! భార్య మాటకి కట్టుబడి కన్నవారికి అన్యాయం జరుగుతోందని తెలిసీ నోరెత్తలేని తమ చేతకానితనానికి తమకు తామే శిక్ష విధించుకోక తప్పదు. పాపం ఇప్పుడెక్కడున్నారో? ఎలా వున్నారో... మానసిక వేదనకు గురైన భాస్కర్‌కి ఎంతకీ నిద్ర రాకుండా వుంది.

★★★★★

ముగ్గురు తోడికోడళ్లది ఒకే మాట! వారు ఆడింది ఆట.. పాడింది పాట! వారి నిర్ణయాలకు తిరుగులేదు.

భర్తలెలాగూ వారి మాటకు ఎదురు చెప్పగల గుండె ధైర్యం లేదు. పెద్ద కోడలు మిగతా ఇద్దరి తోడికోడళ్ళకీ రింగ్ మాస్టర్! ఆమె నిర్ణయాలనే మిగతా ఇద్దరూ తు.చ. తప్పకుండా అమలు చేస్తారు. ఎందుచేతనంటే.. ముగ్గురూ ఫ్రెండ్స్! ఒకే కాలనీలో వుంటూ... ఒకే హైస్కూల్లో.. అటుపై కాలేజీల్లో... కలిసి చదువుకున్నారు... చదువుకునే రోజుల్లో తాము తోడికోడళ్ళవుతామనేది వూహించని విషయం.

తీరా పెళ్లిళ్లు అయ్యాక... తోడికోడళ్లుగా బంధుత్వం కలిసినందుకు ముగ్గురూ మురిసిపోయారు.

అటు భర్త మాట... ఇటు అత్తమామల మాటలు సాగ నివ్వకుండా అష్టదిగ్బంధం చేశారు. వారి స్వాతంత్ర్యాన్ని కట్టుదిట్టం చేశారు.

ముగ్గురు అన్నదమ్ములు నోరు లేనివారైనారు. పెళ్లాలకు మితిమీరిన స్వేచ్ఛ ఇచ్చి

తాము తప్పు చేసినట్టు లేటుగా నాలుక్కరచుకున్నారు. అప్పటికే పరిస్థితి చేయి దాటడంతో..తోకాడించే పెట్స్‌లా వుండిపోక తప్పటం లేదు.

కొడుకుల ఇళ్లలో తమకు సరైన తిండిలేకపోగా... స్వేచ్ఛా స్వాతంత్ర్యాలు సైతం మృగ్యమని ముసలివారు గ్రహించి ఏమీ చేయలేని నిస్సహాయ స్థితిలో ఎవరినీ ఏమీ అనలేక గుడ్లు మిటకరించాల్సి రావటం.. వారి పట్ల శాపంగా పరిణమించింది.

ముగ్గురు కొడుకుల దగ్గర అత్తమామలు తలా నాలుగు నెలలు వుండాలనే జీవో పాస్ చేసింది పెద్ద కోడలు! కాకుంటే తమకిష్టమైన కొడుకు దగ్గరే శాశ్వతంగా వుండిపోవాలనే ముసలి వారి నిర్ణయానికి గండి కొట్టి కుటుంబంలో రాజకీయాలు నడిపిన దిట్ట పెద్దకోడలు!

తాచెడ్డ కోతి వనమెల్లా చెరిచిందని సామెత మిగతా ఇద్దరి తోడికోడళ్లని (ఆఫ్‌కోర్స్ ఫ్రెండ్స్ కూడా అనుకోండి) తన నిర్ణయాల పట్ల ఆకర్షితులను చేసుకుని తన గుప్పిట్లో.. చెప్పు చేతల్లో వుంచుకోగలిగిందంటే... అమల ఎంత అమోఘమైన తెలివితేటలు కల ఆడదో ఇట్టే ఎవరైనా ఊహించవచ్చు!

ఇది ఒక సినిమా కథలా వుంటుందనిపిస్తుంది. జస్ట్ ఓల్డ్ వైన్ ఇన్ న్యూ బాటిల్! దట్సాల్!!

ముసలి వారొస్తున్నారంటే చాలు. అదేం విచిత్రమో... వీధి గుమ్మంలో ఎదురై చిరునవ్వులు చిందిస్తూ లోనికి ఆహ్వానించటం పోయి.. తలుపు బిడాయించుకోవడం.. ఆటో దిగిన అత్త మామలు లగేజీతో వీధిలోనే నిలబడి తలుపు బాదగా బాదగా.. గొంతు చించుకు అరవగా... అరవగా... అయిష్టంగా తలుపు తీసినా... కుశలమడక్కుండానే బెడ్‌రూమ్‌లోకి వెళ్లి డోర్ బిడాయించుకోవడం వంటివి.. తటస్థించటం చూస్తూ ముసలివారి ప్రాణం విలవిల్లాడిపోతుంది. దయనీయమైన తమ స్థితికి వాపోటం తప్పించి మరో మార్గం వారికి కానరాలేదు.

అత్త కోడళ్లని కోరంటికం పెట్టటం పరిపాటి.

ఇక్కడ అందుకు భిన్నం! అత్తగారెంత సౌమ్యంగా వున్నా... ఆమె నిర్లక్ష్యానికి గురి కావటం...దెప్పుల్లు.. సూటీపోటీ మాటలు కాటేయటం చూస్తూ కొడుకుల దగ్గర వుండటానికి తామెందు కొచ్చామనే ఆవేదనకు గురికాక తప్పటం లేదు.

ఇక మామగారి విషయానికొస్తే.. ఆయన ఫోన్ చేసుకోవటానికి వీల్లేదు. టీ.వి. పెట్టనివ్వరు. కనీసం న్యూస్‌పేపరు కూడా తిరగేయనివ్వని చుప్పనాతి శూర్పణకలైన కోడళ్ల ప్రవర్తనకి..నొచ్చుకుని బాధపడటం తప్ప మరో మార్గం కన్పించదాయనకు.

వృద్ధ దంపతులు ఒకరినొకరు ఓదార్చుకోవటం తప్ప మరోదారి లేదు. వారికి! ఇలా ఎన్నాళ్లు? ఎన్నేళ్లు? అశాంతితో... అనారోగ్యంతో.. ఆర్థిక పరమైన ఇబ్బందులతో శేష జీవితాన్ని గడపాలంటే దుర్భరంగా వుంది.

తాను హరీ అన్న తర్వాత నోరులేని భార్య గతేమౌతుందోననే దిగులు ముసలాయన్ను కలవరపెడుతోంది.

చచ్చింతర్వాత వీళ్లెలాగూ తద్దినం పెట్టరు సరికదా.. బ్రతికి వుండగానే తద్దినం పెట్టించుకునే దుస్థితి తమకు దాపురించిందే అనేది వారి బాధ!

కొడుకులను చూద్దామా అంటే పెళ్లాల మాటకు తానా అంటే తందానా అనటం చూస్తుంటే మనసు క్షోభకు గురౌతుంది.

రాఘవయ్య స్వాతంత్ర్య సమర యోధుడు. బ్రిటీష్‌వారి నెదిరించి జైలుకెళ్ళాడు. ఎన్నో ఉద్యమాల్లో పాల్గొన్నాడు. తాను ప్రదర్శించిన దేశ భక్తి గురించి మెచ్చి అయిదెకరాలు భూమినిచ్చింది. ఇప్పుడు ఫించనిస్తోంది. అది ఏ మూలకూ చాలదు. అయినా చింత లేదు రాఘవయ్యకి. ఇన్నేళ్ల జీవితంలో అసంతృప్తి ఎరగడు. కొడుకులను విద్యావంతులను చేసి సమాజంలో ప్రయోజకులయ్యేట్లు తీర్చిదిద్దాడు.

కానీ ఏం లాభం? స్వాతంత్ర్యం వచ్చాక దేశం రాజకీయంగా ఎలా పాడైందో... కొడుకులకు పెళ్లిళ్లు చేశాక కోడళ్లు ఇంట్లో అడుగు పెట్టేక మమతానురాగాలు.. ఆప్యాయతలకు చిరునామా చెల్లిపోయింది.

ముగ్గురు కోడళ్లు ఏకమై.. రసవత్తరంగా నాటకం ఆడి. తమను కొడుకులకు కాకుండా చేసి... జీవిత నాటకాన్ని కడు రమ్యంగా రక్తికట్టించారు. ఇంకా కొడుకుల దగ్గరే అసంతృప్తితో.. అశాంతితో... నిత్య ఘర్షణలతో జీవిత చరమాంకాన్ని వెళ్లదీయటానికి రాఘవయ్య దంపతులకు మనస్కరించలేదు.

మూడో కంటికి తన ఆలోచనను నిర్ణయాన్ని తెలియనివ్వకుండా... ఓ శుభముహూర్తాన భార్యని వెంట పెట్టుకుని... శేష జీవితాన్ని తృప్తిగా మనశ్శాంతితో గడపాలని వృద్ధాశ్రమాన్ని ఆశ్రయించాడు.

ఆశ్రమంలో తన వంటి దురదృష్టవంతులు ఎందరో? ఒక్కొక్కరిది ఒక్కో రకమైన కథ! రాబోయే కాలంలో తమ కొడుకులు.. కోడళ్లు... వృద్ధాప్యంలో ఇలాంటి చోటే విశ్రాంతి తీసుకోక తప్పదు అన్పించకపోలేదు.

తమకు కొడుకులు లేరనుకునే అభిప్రాయాన్ని కొచ్చారు. తమకు అసలు సంతానమే లేదు అనే స్థితికి చేరుకున్నారు. అందరూ వున్నా.. తమకెవ్వరూ లేని అనాథలు!

కాలం మారుతోంది! మనుష్యులు మారుతున్నారు. స్వార్థ చింతన పెరుగుతోంది. కన్నవారి యందు పిల్లల్లో మమతాను రాగాలు మృగ్యమౌతున్నాయ్. అందుకే అంతిమ ఘడియల్లో ఇలాంటి కఠినమైన నిర్ణయాన్ని రాఘవయ్య తీసుకోవలసి వచ్చింది.

తమకెవరు తల కొరివి పెట్టవలసిన అవసరం కూడా లేదన్పించింది. కొంత డబ్బు

ఆశ్రమానికి అంత్యక్రియల ఖర్చు కింద ఇస్తే వారే తమ చితులకు నిప్పంటిస్తారు. దట్సాల్!

తనకొచ్చే వృద్ధాప్య ఫింఛను డబ్బు మిగిల్చి ఆశ్రమానికి ఈయ నిర్ణయించుకున్నాడు. తమ గురించి నిర్లక్ష్యం చేసి పిల్లలకు తనకున్న కాస్త పొలం మాత్రం ఎందుకు చెందనీయటం అన్పించింది? అందుకే తమ తదనంతరం తన పేరున వున్న ఐదెకరాల పొలం సైతం వృద్ధాశ్రమానికే సర్వహక్కులు చెందేటట్టు విల్లు రాయాలని తీర్మానించుకున్నారు.

అవును. తమను ఆదుకున్నవాడే దైవం! కడుపున పుట్టిన పిల్లలైతేనేం?.. వృద్ధాశ్రమ మేనేజ్‌మెంట్ అయితేనేం?

మానవతా దృక్పథంతో అక్కున చేర్చుకుని ఇంత తిండి పెట్టి..బాగోగులు చూచేవారికి తన ప్రతి పైసా దక్కాలనుకోవటంలో ధర్మం. న్యాయం వున్నదన్పించింది. కొడుకుల పట్ల తమకుగల అప్యాయతానురాగాలకు శాశ్వతంగా తెరదించేశాడు. ఆ క్షణం గుండెమీద బరువు దించినట్టన్పించింది.

రాఘవయ్య ఆలోచన్లకు శాశ్వత పరిష్కారం లభించటంతో... గత స్మృతులు మనసులో నుండి తొలగి శాశ్వతంగా తెరపడినట్టన్పించింది.

-: సమాప్తం :-

*('ఆంధ్రభూమి' దిన పత్రిక 28.3.2009)*